తగ్గిన ఓటింగ్ శాతం..!

- అసెంబ్లీ కంటే పార్లమెంట్‌కు తగ్గిన వైనం
- వైరాలో 81.6, సత్తుపల్లిలో 80.34, మధిరలో 81.84 శాతం నమోదు


వైరా బ్రాహ్మణపల్లిలో బారులుదీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

వైరా నియోజకవర్గంలో..

వైరా: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే వైరా నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. వైరా నియోజకవర్గంలో ప్రతీ ఎన్నికకు ఓటర్లు పెరుగుతున్నారు కానీ పోలింగ్‌శాతం మాత్రం పెరగడం లేదు. నియోజకవర్గంలో 81.6 శాతం పోలింగ్ నమోదయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికలలో 86.7 శాతం నమోదు కాగా ప్రస్తుతం 5.1 శాతం ఓట్లు తగ్గాయి. గిరిజన గ్రామాల్లో ప్రతిసారీ ఓటింగ్ శాతం పెరుగుతూ వస్తుండగా పట్టణ ప్రాంతమైన వైరాలో పోలింగ్‌శాతం గణనీయంగా తగ్గింది. నియోజకవర్గంలో 252 పోలింగ్ కేంద్రాలు ఉండగా సగానికి పైగా పోలింగ్ కేంద్రాల్లో 60 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యింది. మొత్తం 1,93,389 ఓట్లకుగాను 1,56,762 పోలయ్యాయి. ఇందులో 80,323 మంది మహిళలు, 76,436 మంది పురుషులు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

పోలింగ్‌కేంద్రాల వారీగా..

నియోజకవర్గంలో అత్యధికంగా జూలూరుపాడు మండలం భేతాళపాడు, పాపకొల్లులో 1,223 ఓట్లకు గాను 1,009 ఓట్లు పోలయ్యాయి. దుబ్బతుండా 192 మంది ఓటర్లు ఉండగా 183 ఓట్లు పోలయ్యాయి. కొణిజర్ల మండలం మల్లుపల్లిలో 1364 ఓట్లు ఉండగా 983 ఓట్లు పోలయ్యాయి. కొణిజర్ల 166 పోలింగ్ స్టేషన్‌లో 1,237 ఓట్లు ఉండగా 983 ఓట్లు పోలయ్యాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలో బ్రాహ్మణపల్లి 197 పోలింగ్ కేంద్రంలో 1,134 ఓట్లకు గాను 874 ఓట్లు పోలయ్యాయి. వైరా మండలంలోని అష్టగుర్తిలో 1,194 ఓట్లు ఉండగా 1,049 ఓట్లు పోలయ్యాయి. ఏన్కూరు మండలంలో ఏన్కూరు పోలింగ్ కేంద్రంలో 1,258 ఓట్లు ఉండగా 1010 ఓట్లు పోలయ్యాయి. అతి తక్కువగా నాచారం పోలింగ్ కేంద్రంలో 397 ఓట్లు ఉండగా 328 ఓట్లు పోలయ్యాయి. కారేపల్లి మండలంలో గాదెపాడు పోలింగ్ కేంద్రంలో 1,225 ఓట్లకుగాను 1,009 పోలయ్యాయి. గంగారం పోలింగ్ కేంద్రం పరిధిలో 305 ఓట్లకు గాను 250 పోలయ్యాయి.

90 శాతం దాటిన పోలింగ్ కేంద్రాలివే..

నియోజకవర్గంలో 90 శాతం పైగా పోలింగ్ నమోదయిన కేంద్రాల్లో గత ఎన్నికలలో మాదిరిగానే జూలూరుపాడు మండలం నల్లబోడు తండాలో 95.97 శాతం పోలింగ్ నమోదయ్యింది. అదే మండలంలో దుబ్బతండా 95.31, మద్దులగూడెంలోని ఓ పోలింగ్ కేంద్రంలో 91.05 శాతం నమోదయ్యింది. కారేపల్లి మండలంలో గోవిందు తండా పీఎస్‌లో 92.20 శాతం, దుబ్బతండాలో 90.11 శాతం నమోదయ్యింది. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో 2 పోలింగ్ కేంద్రాల్లో 91.45,. మరో దానిలో 91.32 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఏన్కూరు మండలం గంగులనాచారం పీఎస్‌లో 90.37 శాతం పోలింగ్ నమోదయ్యింది. వైరా మండలంలో ఎక్కడా 90 శాతం నమోదు కాకపోవడం విశేషం.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పోల్చితే ఈ సారి 7.09 శాతం ఓటింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో 87.43 శాతంతో 2,43,118 ఓట్లకు గాను 2,12,549 ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల్లో 80.34 శాతంతో 2,43,943 ఓట్లకు గాను 1,95,979 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పురుషులు 95,928 మంది, మహిళలు 1,00,046 మంది, థర్డ్‌జండర్ 5 గురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలే ఈ సారి ఓటింగ్‌లో సత్తా చాటారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 294 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. తల్లాడ మండలం మల్లారం నుంచి ఓటింగ్ ప్రారంభమై వేంసూరు మండలం భరణిపాడుతో ముగుస్తుంది.

మధిరలో..

మధిర:పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మధిర నియోజకవర్గంలో మొత్తం 2,22,160 ఓట్లు ఉండగా 1,81,809 ఓట్లు పోలయ్యాయి. మధిర నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,07,111 మంది పురుష ఓటర్లు, 1,15,039 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 10 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో 88939 మంది పురుషులు, 92,870 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 6గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 81.84 శాతం ఓటింగ్ నమోదయింది.

అసెంబ్లీ కంటే రెట్టింపు మెజార్టీ

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీ వస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నాలుగు నెలల తన పనితీరుకు ఈ ఎన్నికలు అద్దంపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకుంటున్నారన్నారు.

ఇంటి దొంగలను రానివ్వం..

సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ఇంటి దొంగల వల్లే కొన్ని సీట్లు తగ్గాయని చెప్పారని, ఇంటి దొంగలను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోకి రానివ్వమని డాక్టర్ మట్టా దయానంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఇటీవల ఇతర చోట్ల చేరిన ఎవరికి పార్టీలో అవకాశం ఉండదని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున అనుభవించేందుకు కొందరు వస్తామని చెప్పే అలాంటి నాయకులు అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివవేణు, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, పసుమర్తి చందర్‌రావు, రఘుపతిరెడ్డి, సోమిరెడ్డి, దాసరి వెంకటేశ్వరరెడ్డి, దూదిపాల రాంబాబు, పద్మజ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఇండియా కూటమిదే అధికారం

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: దేశంలో ప్రస్తుతం జరిగిన నాలుగు దఫాల పార్లమెంట్ ఎన్నికలను విశ్లేషించి చూస్తే సర్వేలన్నీ ఇండియా కూటమికే అధికారమని చెబుతున్నాయని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం వైరా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా కూటమి బలపర్చిన ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారన్నారు. ఇండియా కూటమిని అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొర్రా రాజశేఖర్, నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, స్వర్ణ నరేంద్ర, మంగీలాల్ నాయక్, రాంపూడి రోశయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు, కృష్ణారావు, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, శబరీనాథ్, కౌన్సిలర్ గుడిపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో వర్షం


సత్తుపల్లిలో వర్షం పడుతున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో వచ్చిన వర్షంతో ఉపశమనం కలిగింది. సుమారు రెండు గంటల పాటు సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తల్లాడలో..

తల్లాడ: తల్లాడలో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై వర్షాకాలాన్ని తలపించింది. మండు వేసవిలో కురుస్తున్న అకాల వర్షానికి మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భగ్గుమంటున్న ఎండలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

పొంచి ఉన్న ప్రమాదం..


విరిగిపోయిన విద్యుత్‌స్తంభం

ముదిగొండ: ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభం విరిగి తీగలతో వేలాడుతూ.. ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని అయ్యగారిపల్లి, గంధసిరి బీటీ ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ పెద్ద లైన్ రెండు స్తంభాలు విరిగి వేలాడడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల వచ్చిన గాలి దుమారానికి పలు విద్యుత్ స్తంభాలు కుప్పకూలి కిందపడిపోయాయి. దానిలో భాగంగా కొన్ని స్తంభాలకు మరమ్మతులు చేయకపోవడంతో అవి కాస్త ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కొణిజర్ల: సీపీఎం ప్రజా సంఘాలతో ప్రజా ఉద్యమాలు నిర్వహించిన బండి పాండయ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన బండి పాండయ్య వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాండయ్య చిత్ర పటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం కొప్పుల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో నాయకులు యర్రా శ్రీకాంత్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, దొంగల తిరపతిరావు, మండల నాయకులు వాసిరెడ్డి వరప్రసాదరావు, చెరుకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు చలపతిరావు, రమ్య, అమరావతి, ఆనందరావు, వీరభద్రం, అనుమోలు రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న నరేష్, నాయకులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు ప్రారంభించారు. ఫ్రెండ్స్‌యూత్ నాయకులు శెట్టిపల్లి నరేష్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ ధర్మారావు, చీరాల నర్సింహారావు, ఆది నర్సింహారావు పాల్గొన్నారు.

నివాళి..

ముదిగొండ: ముదిగొండకు చెందిన సీపీఎం నాయకుడు, కో ఆప్షన్ సభ్యుడు పఠాన్ సోందు మియా(55) మంగళవారం మృతి చెందగా పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురోషోత్తం, వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, నాయకులు మందరపు వెంకన్న, బట్టు రాజు, మెట్టెల సతీష్, ఇరుకు నాగేశ్వరరావు, యండ్రాతి సీతయ్య, మందరపు పద్మ ఉన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ


మధిర: సరుకులు అందజేస్తున్న చంద్రశేఖర్

మధిర: టీవీఎం వాకర్స్ క్లబ్ తరఫున ప్రముఖ వ్యాపారవేత్త పుల్లఖండం చంద్రశేఖర్ మంగళవారం పలు నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు, ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో దెందుకూరు, మడుపల్లి, ఆత్కూరు తదితర గ్రామాల్లో రెండు నెలలకు సరిపడా సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ... సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.


కారేపల్లి: సరుకులు పంపిణీ చేస్తున్న 'ఆకలి అందరిది' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయిన బాధితురాలికి 'ఆకలి అందరిది' స్వచ్ఛంద సంస్థ మంగళవారం వితరణ అందజేసింది. మండలపరిధిలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఎజ్జు సునీత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఫక్రుద్దీన్, రఫీ, సుదర్శన్, గోవర్ధనగిరి ధశరథ్, కల్తీ బుచ్చయ్య, జాగటి వినోద, జె.నాగేశ్వరరావు, జి.లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

లూర్దు గిరిమాత తిరునాళ్ల మహోత్సవం


బనిగండ్లపాడులో లూర్దుమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని గుట్టపై కొలువై ఉన్న లూర్దు గిరిమాత తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. విచారణ గురువులు ఫాదర్ తలపనేని అంతోని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు ఉత్సవాల పతాక ఆవిష్కరణ, దివ్య బలిపూజ, ఫాదర్స్ తలపనేని ఆంథోనితో పాటు పలువురు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం లూర్దు గిరిమాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ మేరకు నిర్వహించిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సిస్టర్స్, సంఘస్తులు ఉన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు..

- అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు


చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

చింతకాని: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో గ్రామ చివరన, పంట పొలాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన కొన్నేళ్ల కిందట నీటి తొట్లను నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీటికోసం అల్లాడుతున్నాయి. మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాల్లో నీటితొట్లను నిర్మించింది. తొట్లను నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు వాటిని ఉపయోగించిన దాఖలాలు లేకపోవటంతో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాగేందుకు నీళ్లు దొరక్క పశువులు అల్లాడుతున్నాయి. నీటితొట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో కొన్నిచోట్ల శిథిలావస్థకు కూడా చేరాయి. ఎండల తీవ్రతకు మండలంలోని మున్నేరు, వాగులు, చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. మేత కోసం పొలాలకు వెళ్లిన పశువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పశువుల దాహార్తిని తీర్చేందుకు కొంతమంది రైతులు వ్యవసాయ, బోరు బావుల వద్ద నీటిని పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్నటువంటి నీటితొట్లకు నీటి సౌకర్యాన్ని కల్పించి వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చాలని రైతులు కోరుతున్నారు.

చెరువులు ఎండిపోయాయి



ఎండల తీవ్రతకు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోయాయి. తాగేందుకు నీళ్ల లేక పశువులు ఇబ్బంది పడుతున్నాయి. నీళ్ల ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పశువులు దాహం తీర్చుకుంటున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లకు మరమ్మతులు చేయించి పశువుల దాహార్తిని తీర్చాలి.

– ఎరుకలబోయిన శ్రీనివాసరావు, రైతు, మత్కేపల్లి, చింతకాని మండలం

వినియోగంలోకి తీసుకురావాలి..



గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పశువులకు నీరు దొరకడం లేదు. పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో చెరువులు, కుంటల్లో నీరు లేదు. తక్షణమే నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– పగడాల పుల్లయ్య, రైతు, మత్కేపల్లి

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లోకి చేరిన ప్రసాదరావు తదితరులు

మధిర: మధిర పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ కమిటీ చైర్మన్, మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు కుటుంబాల వారు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని విక్రమార్క పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మధిర సేవాసమితి అధ్యక్షుడిగా పల్లపోతు ప్రసాదరావు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఆలయాల్లో అన్నదానం


భక్తాంజనేయస్వామి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం, వేంసూరు రోడ్డు శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యగారిపేట ఆలయంలో కొల్లి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, మెట్టాంజనేయస్వామి ఆలయంలో గంధ్ర సత్యనారాయణరెడ్డి, సూర్యకుమారి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, బొంతు మాధవరావు, వల్లభనేని ప్రవీణ్, మిద్దే రామకృష్ణ, పురుషోత్తం, రజిని పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీకే మెజారిటీ సీట్లు

కల్లూరు: రాష్ట్రంలో బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కైవసం చేసుకుంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కల్లూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలో బీజేపీ బలపడిందని, కాంగ్రెస్‌కు పోటాపోటీగా నిలుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ ప్రథమ స్థానానికి ఎగబాకుతుందని, కాంగ్రెస్ అస్తవ్యస్తమవుందన్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత ఏర్పడే అవకాశం బాగా ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ఎర్రుపాలెం: బీఆర్‌ఎస్‌కు, రాజకీయాలకు పూర్తిగా రాజీనామా చేస్తున్నట్లు మధిర మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు చావా రామకృష్ణ ప్రకటించారు. మంగళవారం తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 41 ఏళ్లుగా టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పలు పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేసిన తాను ఇకపై రాజకీయాలకు శాశ్వతంగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తన సహాయం అవసరమైన వారికి మాత్రం అందుబాటులో ఉంటానన్నారు. రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షులకు పంపినట్టు రామకృష్ణ తెలిపారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి..


గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న గోవిందుతండా వాసులు

కారేపల్లి: మండలంలోని గోవిందుతండా గ్రామ సమస్యలపై మంగళవారం గ్రామస్తులు వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి, సమస్యలను వివరించారు. ఖమ్మం నుండి మాధారం వరకు నడుస్తున్న టీఎస్‌ఆర్టీసీ బస్సు సర్వీసును గోవిందు తండా వరకు పొడిగించాలని, డోలమైట మైన్స్ నుంచి వృథాగా నీటిని గోవిందుతండా చెరువులోకి మళ్లించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును గోవిందుతండా వరకు పొడిగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో నాయకులు నగేష్, భానోత్ కోటి, వాంకుడోత్ వీరన్న, వీరూ, భానోత్ శివ, మధు, తదితరులు పాల్గొన్నారు.